# పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రజలకు సమయానికి సేవలు అందేలా చర్యలు..

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- సాదా బైనామా పెండెన్సీని మార్గదర్శకాల
- ప్రకారం పూర్తిగా క్లియర్ చేయాలి..
- భూ భారతీ, మీ సేవా, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి..
- ప్రతి మండలంలో లభ్యమయ్యే ప్రభుత్వ భూములపై సమగ్ర నివేదిక సమర్పించాలి..
- పౌర సేవల దరఖాస్తుల్లో పెండెన్సీకి అవకాశం లేదు..
- భూ భారతీ స్లాట్లలో ఆలస్యం సహించబోం, సమయానికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి..
- మార్గదర్శకాల ప్రకారం అన్ని దరఖాస్తులను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలి..
- ప్రజావాణి వినతులను 15 రోజుల్లో పరిష్కరించాలి..
- రెవెన్యూ శాఖపై సమీక్షించిన జిల్లా కలెక్టర్..



ఖమ్మం స్టాఫ్ రిపోర్టర్ మే 6 (అక్షరం న్యూస్)

రెవెన్యూ శాఖలో పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రజలకు సమయానికి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మీ సేవా, భూ భారతీ, సాదా బైనామా, ప్రభుత్వ భూములు, పెండింగ్ సర్వేలు, ఇసుక, ఎస్ఐఆర్ వంటి అంశాలపై సమీక్షించారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సాదా బైనామా అంశంపై ప్రత్యేకంగా ఆరా తీసిన కలెక్టర్, ఎన్ని నోటీసులు జారీ చేశారు, ఎన్ని ఫీల్డ్ ఎన్క్వైరీలు నిర్వహించారు, ఎన్ని అర్హులను గుర్తించారు, ఎన్ని దరఖాస్తులను ఆర్డీవోకు పంపించారో నివేదికలో స్పష్టంగా చూపించాలని ఆదేశించారు. జిల్లాలో సాదా బైనామాకి సంబంధించి తహసీల్దార్లు మార్గదర్శకాల ప్రకారం అన్ని పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సాదా బైనామా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 2014 జూన్ 2కు ముందు జరిగిన లావాదేవీలకే ప్రాధాన్యత ఇవ్వాలని, దరఖాస్తుదారులు భూమి స్వాధీనంలో ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ భూమి ఒక్క అంగుళం కూడా రెగ్యులరైజ్ చేయరాదని, సరైన ఆధారాలు లేకుండా భూమి యాజమాన్యం మారకూడదని హెచ్చరించారు. ఆమోదించిన దరఖాస్తులకు పంచనామా తప్పనిసరి కాగా, తిరస్కరణ లకు కారణాలు, ఎన్క్వైరీ నివేదిక సరిపోతుందని తెలిపారు. భూమి స్థితిగతులపై పొరుగు పట్టాదారుల అభిప్రాయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

భూ భారతీ పెండింగ్ స్లాట్లపై సమీక్షిస్తూ, రిజిస్ట్రేషన్ జరగని ప్రతి స్లాట్‌కు కారణాలు నమోదు చేయాలని, నిర్దిష్ట సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తి చేయని వారి స్లాట్లు రద్దు అవుతాయని ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. భూ భారతీ క్లియరెన్స్ ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తూ, ప్రతి రోజు 3 మండలాల నుండి క్లియర్ చేసిన ఫైళ్లను జిల్లా స్థాయికి తుది ఆమోదం కోసం పంపించాలని తెలిపారు. జిల్లా స్థాయి ఆపరేటర్ మండల అధికారులతో సమన్వయం చేస్తూ, పంపిన ప్రతి ఫైల్‌కు భౌతిక ప్రతులు తప్పనిసరిగా జిల్లా కార్యాలయానికి చేరేలా చూడాలని సూచించారు.

రెవెన్యూ సదస్సుల్లో పెండింగ్ దరఖాస్తులపై మాట్లాడుతూ, అసైన్‌మెంట్ భూములను మినహాయించి, మిగతా దరఖాస్తులను మార్గదర్శకాల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. మీ సేవా దరఖాస్తులను తహసీల్దార్లు సమయానికి క్లియర్ చేయాలని, పౌర సేవలకు సంబంధించిన దరఖాస్తుల్లో పెండెన్సీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. తదుపరి సమీక్ష నాటికి ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండకూడదని స్పష్టం చేశారు.

ప్రతి మండలంలో లభ్యమయ్యే ప్రభుత్వ భూముల వివరాలు, విస్తీర్ణం, అభివృద్ధి కార్యక్రమాలకు అనుకూలతపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. భూములను 5, 10, 20 ఎకరాల విభాగాలుగా వర్గీకరించి, రహదారి సౌకర్యం ఉన్నవి, లేనివి అని స్పష్టంగా చూపించాలని సూచించారు. నేలకొండపల్లి మండలంలో ఇప్పటికే స్వయం సహాయక సంఘానికి పెట్రోల్ బంక్ కోసం భూమి కేటాయించిన నేపథ్యంలో, రైస్ మిల్ ఏర్పాటు కోసం మరో 5 ఎకరాల భూమి లభ్యతపై పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. 2025 ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో మార్గదర్శకాల ప్రకారం ఎస్.ఐ.ఆర్. మ్యాపింగ్ నిర్వహించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ వారీగా ఎస్.ఐ.ఆర్. మ్యాపింగ్ తక్కువగా ఉన్న చోట్ల బూత్ స్థాయి అధికారుల పనితీరును నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకే ఓటరు రెండు చోట్ల నమోదు కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఒక్క చోట మాత్రమే నమోదు ఉండేలా చూడాలని మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. అభివృద్ధి పనులు, ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎలాంటి ఇసుక సమస్యలు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. 'మన ఇసుక వాహనం' విధానం ప్రకారం ఎవరైనా సాండ్ బజార్ ద్వారా ఇసుకకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి దరఖాస్తులను పరిశీలించి టోకెన్ జారీ చేస్తారని, విధానాన్ని కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. సాండ్ బజార్‌లో లభించే ఇసుక తక్కువ ధరలో అందుబాటులో ఉన్నందున ప్రజలు పొందాలని సూచించారు.

ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని గ్రీవెన్స్ విభాగానికి పంపించి, అక్కడి నుంచి సంబంధిత అధికారులకు పంపాలని తెలిపారు. ప్రతి వినతిని ప్రజావాణి ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్లోడ్ చేయడంతో పాటు, తీసుకున్న చర్యల నివేదికను కూడా నమోదు చేయాలని సూచించారు. ఏ వినతీ 15 రోజులకు మించి పెండింగ్‌లో ఉండకూడదని, 15 రోజులు దాటిన వినతుల వివరాలను కలెక్టర్‌కు నివేదించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు తమకు వచ్చిన ప్రతి వినతిని 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్లు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ ల సూపరింటెండెంట్లు, ఆర్ఐలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుంది ..ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

అకాల వర్షంతో తడిసిన ప్రతి గింజను కొనుకోలు చేస్తాం

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం

అంతర్గాం: రామగుండం నియోజకవర్గంలో కురిసిన అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోవడంతో బుధవారం రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గారు అంతర్గాం మండలంలోని అంతర్గాం టి టి ఎస్, పొట్యాల, మద్దిర్యాల, సోమనపల్లి, బ్రాహ్మణపల్లి, కుక్కల గూడూరు గ్రామాల్లో పర్యటించి సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, తడిచిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తడిసిన ధాన్యానికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు నమోదు చేసి, రైతులకు తగిన సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి నష్టాన్ని తగ్గించే చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## యూనియన్ బ్యాంకులో ఉచిత వైద్య శిబిరం...



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 6. పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని, విద్యానగర్ బ్రాంచ్ యూనియన్ బ్యాంకులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 150 మంది ఉద్యోగులు, సిబ్బంది, కష్టమర్లకు ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు చేపట్టి రోగనిర్ధారణ చేసి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటిస్తూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు దరిచేరవని సూచించారు. ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ కిరణ్ మాట్లాడుతూ... యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది, కస్టమర్లు, వారి కుటుంబ సభ్యులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెడికవర్ ఆసుపత్రిలో పండుగలు, సెలవులతో సంబంధం లేకుండా 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ శిబిరంలో యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ఎం. నిరంజన్, ఉద్యోగులు, సిబ్బంది, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.


## జి డి కే.2 ఇంక్లైన్ కార్మికులను కలిసిన కొత్త యూనియన్ టీజీకేఎస్ కెంగర్ల మల్లయ్య



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 6 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ తెలంగాణ బొగ్గుగని కార్మిక సమాఖ్య (టి జి కె ఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అగ్ర నేతలు బుధవారం సింగరేణి కార్మికులను కలిశారు. పెంచాల తిరుపతి ఆధ్వర్యంలో కేంద్ర కమిటీ వ్యవస్థాపక కన్వీనర్ కేంగర్ల మల్లయ్య సింగరేణి ఆర్జీవన్ రెండవ ఇంక్లైన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మళ్లీ బి ఎఫ్ ఆర్ పరిధిలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. దీంతో కార్మికుల సంక్షేమం దెబ్బతింటుందని హెచ్చరించారు. సంస్థ మరో వందేళ్లు నిలవాలంటే కార్మికులు పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మల్లయ్యను కార్మికులు ఆత్మీయంగా స్వాగతించారు. గతంలో సాధించిన హక్కులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం కొత్త హక్కులు రాలేదని అభిప్రాయపడ్డారు. కార్మికుల ఇళ్లకు కల్పించిన ఎ సి సౌకర్యాన్ని ప్రశంసించారు. అది కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతోం దన్నారు. పార్టీలకు అతీతంగా కలిసి పనిచేస్తామని కార్మికులు హామీ ఇచ్చారు.

## పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడికి అదనపు బాధ్యతలు

### మానవ హక్కుల పరిరక్షణలో మరింత కట్టుబాటు: కొండల రాజేందర్ కుమార్



జ్యోతి నగర్ ఎన్టిపిసి మే 6 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : మానవ హక్కుల పరిరక్షణలో విశేష సేవలు అందిస్తున్న హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్ ఆర్ సి ఐ) సంస్థలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామగుండం కు చెందిన కొండల రాజేందర్ కుమార్‌కు సంస్థ ఉన్నతాధికారులు మరిన్ని బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన, పేదల సమస్యల పరిష్కారం, అన్యాయానికి గురైన వారికి న్యాయం కల్పించడం వంటి అంశాల్లో మరింత నిబద్ధతతో పనిచేస్తానని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మానవ హక్కులపై అవగాహన పెంపొందించడం, బాధితులకు తక్షణ సహాయం అందించడం, సంస్థను బలోపేతం చేయడం తన ప్రధాన లక్ష్యాలుగా కొనసాగిస్తానన్నారు. అలాగే, సంబంధిత జిల్లాల సభ్యులు, నాయకులు సమన్వయంతో పనిచేసి సంస్థ ప్రతిష్టను మరింత పెంచాలని కోరారు. సంస్థ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందిస్తానని తెలిపారు.

## నీతి గెలిచింది.. నీచం ఓడింది

### ఏడు వేల రూపాయల లంచం కోసం ఏసీబీ బోనులోకి ఎక్కిన బోధన్ ఎస్ఐ!



కరీంనగర్ బ్యూరో, మే 06, అక్షరం న్యూస్,

న్యాయాన్ని రక్షించాల్సిన ఖాకీ చొక్కా వేసుకున్నాడే తప్ప, ఆ చొక్కాకు ఉండాల్సిన కనీస గౌరవాన్ని మాత్రం బోధన్ టూ టౌన్ ఎస్ఐ చిటన్నోజు భాస్కరా చారి గంగలో కలిపేశాడు. వేలల్లో జీతం వస్తున్నా కడుపు నిండని ఈ కక్కుర్తి రాయుడు, కేవలం ఏడు వేల రూపాయల చిల్లర కోసం తన పరువును ఏసీబీ ముందు తాకట్టు పెట్టాడు. ఒక క్రిమినల్ కేసులో తన సోదరుడి కొడుకు పేరు చేర్చకుండా ఉండాలంటే "చేతులు తడపాల్సిందే" అని ఫిర్యాదుదారుడిని పీడించిన ఈ ఎస్ఐ, ఆఖరికి ఏడు వేల రూపాయల దగ్గర బేరం కుదుర్చుకున్నాడు. అప్పటివరకు స్టేషన్లో సింహంలా ఫోజులు కొట్టిన ఈ భాస్కరం, ఆ పాచి డబ్బులు తీసుకుంటుండగా సరిగ్గా ఏసీబీ అధికారులు సీన్లోకి ఎంట్రీ ఇచ్చి షాక్ ఇచ్చారు. ఏసీబీని చూడగానే అంతవరకు ఊగిపోయిన ఎస్ఐ గారి గర్వం ఒక్కసారిగా నీరుగారిపోయింది, ముఖం బిక్కమొహంలా మారిపోయింది. కేవలం ఏడు వేల రూపాయల కోసం ఇంత నీచానికి ఒడిగట్టిన ఈ ఖాకీ అవినీతి తిమింగలాన్ని చూసి ప్రజలు ఉమ్మేస్తున్నారు. చట్టాన్ని కాపాడాల్సిన వాడే ఇలా చిల్లర బేరాలకు దిగితే ఇక సామాన్యుడికి దిక్కెవరు? ఏదేమైనా ఈ ఏడు వేల లంచం దెబ్బతో భాస్కరా చారి ఇప్పుడు ఏసీబీ కస్టడీలో ఊచలు లెక్కపెడుతూ తన 'ఘన' చరిత్రను నెమరువేసుకుంటున్నాడు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పే పోలీసులు, ఇలాంటి వాళ్ళ విషయంలో ఆ చట్టం ఎంత కఠినంగా ఉంటుందో ఇప్పుడు ఈయన గారికి ప్రత్యక్షంగా అనుభవంలోకి వస్తోంది.

## చిగురు మామిడిలో రైతు వారోత్సవాలు




చిగురు మామిడి/మే 06: అక్షరం న్యూస్


చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రైతులకు పంట రుణాలపై మరియు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ స్రవంతి మాట్లాడుతూ.. తక్కువ వడ్డీతో వచ్చే బ్యాంకు రుణాలను తీసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని అన్నారు. సమయానికి రుణాలు చెల్లించడం ద్వారా మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చని అన్నారు. మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్ మాట్లాడుతూ రైతులకు పంట సాగులో ఆర్థిక సహాయం అవసరాన్ని వివరించి ప్రభుత్వ పథకాల ద్వారా లభించే రాయితీలు సబ్సిడీలపై అవగాహన కల్పించారు. రైతులు అధికారులను సంప్రదించి తమకు అందుబాటులో ఉన్నా రుణాలు,అవకాశలను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ శంకరయ్య, సీఈఓ నరసయ్య, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సతీష్, సాయికుమార్, అంజలి, ఫరీద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో చైర్మన్ గా జంగా వెంకటరమణారెడ్డి



చిగురుమామిడి/మే 06; అక్షరం న్యూస్,చిగురుమామిడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా జంగా వెంకటరమణారెడ్డి,డైరెక్టర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ రైతులకు మరోసారి సేవ చేసేందుకు అవకాశం రావడం సంతోషంగా ఉందని,రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అంకితభావంతో సేవలను అందిస్తామని తెలిపారు. గత పాలకవర్గమే తిరిగి బాధ్యతలు తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో చైర్మన్ తోపాటు పాలకవర్గ సభ్యులమంతా మరోసారి బాధ్యతలు స్వీకరించడం జరిగిందని రమణారెడ్డి వివరించారు. కొనుగోలు సెంటర్ల వద్ద ఉన్న వరి ధాన్యాన్ని మిలర్లకు తరలించేలా తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జంగా వెంకటరమణారెడ్డిని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కరివేద మహేందర్ రెడ్డి,చిట్టుమల్ల శ్రీనివాస్,అందె స్వామి, పోతరవేణి శ్రీనివాస్ యాదవ్,ముద్రకోల రాజయ్య,కూతురు రవీందర్ రెడ్డి,డైరెక్టర్లు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడుగా బోయిని విజయ్



చిగురుమామిడి /మే06: అక్షరం న్యూస్,

చిగురుమామిడి మండలంలోని నవాబుపేట గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా బోయిని విజయ్ కుమార్ ను మే 01 తేదీన ఎన్నుకోగా, బుధవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఉపాధ్యక్షుడుగా సుద్దాల రవీందర్,ప్రధాన కార్యదర్శి బోయిని సతీష్,కార్యదర్శి మట్టెల విజయ్,సహాయ కార్యదర్శి బోయిని శంకర్,గుండె బాబు,కోశాధికారి గడిపే సాగర్,సహాయ కోశాధికారి ఎడేల్లి బాబు,బోయిని శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శి బోయిని సంపత్ పూలే,రాజు,శ్రావణ్ నాస్తిక్,బెజ్జెంకి సంజీవ్,ప్రచార కార్యదర్శి ఎనగందుల గణేష్,మట్టెల శివ, బోయిని శ్రీకాంత్,రాం చరణ్,కార్యవర్గ సభ్యులు కాశపాక పెద్ద సంపత్,ఎడేల్లి హనుమంత్,బోయిని రాం లక్ష్మణ్,శరయ్య, రాజయ్య,సంపత్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బోయిని విజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలోనే కానీ మండలంలోనే కానీ దళిత సామాజిక వర్గాల ప్రజలను కుల వివక్ష,అంటారనితనంతో ఇబ్బందులకు గురి చేస్తే రాజ్యాంగ స్ఫూర్తితో ఎంతటి పోరాటానికైనా వెనుకాడమన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సమానత్వంతో సంఘటితమై కలిసి ముందుకురావా లని, రాజ్యాంగాన్ని చట్టాలను గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బోయిని వేణు గోపాల్,బీఎస్పీ నియోజకవర్గ నాయ కుడు బోయిని బాబు,ఎంఆర్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బోయిని సతీష్,అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షులు బోయిని ఆది మల్లయ్య, సదయ్య, మనోజ్ కుమార్,శ్రీనివాస్, ల,చంద్రం, బాబు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు కాశపాక పెద్ద సంపత్, శంకర్, సంపత్, సుంకే సుధాకర్,అయిలపాక సాగర్,ఎడేల్లి బాబు, దొణుగు సతీష్,రాజశేఖర్, మ్యాకల సురేష్,అజయ్, సతీష్,రవి తదితరులు పాల్గొన్నారు.